


# పరిపాలన పట్టాలెక్కేనా!

- ముగిసిన ఎన్నికల నియమావళి
- కాంగ్రెస్ సర్కారుపై ప్రజల ఆశలు
- గ్యారెంటీల కోసం ఎదురుచూపులు
- 6 నెలలు పూర్తిచేసుకున్న ప్రజాపాలన
- ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటున్న జనం

నిజామాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి సరిగ్గా ఆరు నెలలు పూర్తయ్యింది. డిసెంబర్ 7న కొలువుదీరిన కొత్త ప్రభుత్వంలో హామీల అమలు అన్నది ఒకడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇకపై పూర్తిస్థాయి పరిపాలనపై దృష్టి పెట్టబోతున్నది. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందా? లేదా? అన్నది ప్రజల్లో అయోమయానికి దారి తీస్తున్నది. పేదలు, మధ్యతరగతి వర్గాలతోపాటు మహిళలు, రైతులు కాంగ్రెస్ తీరుపై ఇప్పటికే నొచ్చుకుంటున్నారు. హామీలను అమలు చేయలేక చతికిల పడుతున్న దరిమిలా పాత ప్రభుత్వం అందించిన పింఛన్లను, రైతుబంధును మాత్రమే అమలు చేస్తున్నది. రైతుభరోసా, మహాలక్ష్మి పథకాల జోలికి ఇంత వరకూ వెళ్లలేదు. ఎన్నికల కోడ్ ముసుగులో కాంగ్రెస్ పాలకులు రెండు నెలల పాటు తాత్సారం చేసినప్పటికీ ఇప్పుడు పూర్తిస్థాయిలో పరిపాలన జోరును చూపించేందుకు ఉత్సాహం చూపుతున్నందున ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలంతా వేడుకుంటున్నారు. స్తబ్ధుగా మారిన పరిపాలనను పట్టాలెక్కించాలని కోరుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జనాలంతా డిమాండ్ చేస్తున్నారు.

### పత్తాలేని రూ.4వేలు పింఛన్...

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి కుటుంబంలోని మహిళలకు రూ.2500 అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మహాలక్ష్మిలో కేవలం ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఒక్కటే అమలైంది. మహిళలకు ఆర్థిక సాయం పత్తా లేకుండా పోయింది. 18 ఏండ్లు నిండిన వారందరికీ నెలకు రూ.2500 చెల్లిస్తామని భారీ ప్రకటనలు చేసి ఇప్పుడేమో పట్టించుకోకపోవడం ఏంటని మహిళాలోకం కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నది. ఇదిలా ఉండగా పింఛన్ల సంగతి అతీగతీ లేకుండా పోయింది. కేసీఆర్ ప్రభుత్వంలో నెల రాగానే ఠంఛనుగా పింఛన్ డబ్బులు చేతికి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. నెలకు రూ.4వేలు పింఛన్ ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీపై నోరెత్తడం లేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారో? కూడా స్పష్టంగా చెప్పకలేకపోతున్నది. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు రూ.500 బోనస్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు గుప్పించింది. కానీ బోనస్ అంతా బోగస్ అన్నట్లుగా యాసంగిలో చేతికొచ్చిన వడ్లకు వర్తింపజేయలేదు. వానాకాలం నుంచి సన్నాలకే ఇస్తామంటూ దాటవేశారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకంలోనూ లోపాలు బహిర్గతం అవుతున్నాయి. రేషన్‌కార్డు లేని పేద కుటుంబాలకు ఈ పథకం వర్తించడం లేదు. ఈ పథకం కింద సగం మందికి మాత్రమే లబ్ధి చేకూరగా చాలా మందిని నిరుత్సాహమే వెంటాడుతున్నది. డిసెంబర్ 9, 2023లోపు రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఈ ప్రక్రియ చేపడతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముంగిట ఆగస్టు 15, 2024 అంటూ ప్రకటన చేశారు. రైతులంతా రూ.2లక్షల మాఫీ కోసం వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ పాలకులు ఏంచేస్తారోనని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

### యంత్రాంగంలో నిర్లిప్తత...



ప్రభుత్వ యంత్రాంగంలో నిర్లిప్తత ఆవరించింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత బదిలీలను చేపట్టింది. ఆ తర్వాత ఈసీ రంగంలోకి దిగి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులను మార్చింది. ప్రస్తుతం కోడ్ ముగియడంతో మరోసారి బదిలీల పర్వం కొనసాగనున్నది. ముఖ్యంగా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లతోపాటు కిందిస్థాయిలోని కీలకమైన అధికార యంత్రాంగమంతా తారుమారు కానున్నారు. ఈసీ ఆదేశాలతో పక్క జిల్లాల నుంచి వచ్చి పనిచేస్తున్న వందలాది మంది అధికారులంతా తిరిగి తమ చోటికి వెళ్లేందుకు ఇప్పటికే పైరవీలు షురూ చేసుకుంటున్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సహా వివిధ శాఖల్లో పనిచేస్తున్న వారంతా స్థానచలనం కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం కాంగ్రెస్‌లో రింగ్ లీడర్లుగా పేరొందిన వారి చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట నియోజకవర్గ ఇన్‌చార్జీలను ప్రసన్నం చేసుకుంటున్నారు. వారిని ప్రసన్నం చేసుకోవడంతోపాటు నచ్చిన పోస్టింగ్‌ను దక్కించుకునేందుకు పాకులాడుతున్నారు. పోలీస్ శాఖలో ఎస్సై, సీఐ, ఏసీపీ/డీఎస్పీ, అదనపు డీసీపీ/అదనపు ఎస్పీ, సీపీ/ఎస్పీ స్థాయి పోస్టులకు సైతం జోరుగా పైరవీలు జరుగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులకు బదిలీ తప్పదనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో నడుస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఈసీ నియామకం ద్వారా బాధ్యతలు చేపడుతున్న కీలక అధికారి పనితీరును కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోవడం లేదని చర్చ నడుస్తున్నది. ఇందులో భాగంగా ఆయనను తప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం. బదిలీలు తప్పదనే కారణంతో యంత్రాంగంలో అడుగడుగునా స్తబ్ధత కనిపిస్తున్నది.



## కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో జిల్లా కేంద్రంలోని పలు రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగు వేశారు. ఈ నెల 4న ఫలితాలు వెల్లడి కాగా, 6న ఎన్నికల కమిషన్ కోడ్‌ను ఎత్తివేసింది. అయినా పలు వీధుల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగులను తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విగ్రహాలపై ముసుగు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– కామారెడ్డి, జూన్ 7

## అమ్మ ఆదర్శ పనుల పరిశీలన

**త్వరగా పూర్తిచేయాలని ఆదేశం**

ఖలీల్‌వాడి, జూన్ 7: 'పేరుకే ఆదర్శం.. పనులు ఆలస్యం' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు స్పందించారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాలుగు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులు చేపట్టాలని, నిధులు వృథా చేయొద్దని సూచించారు. వివిధ రకాలుగా క్రీడా మైదానాన్ని వినియోగించాలని, దీంతో పాములు, ఇతర విష పురుగుల బెడద లేకుండా ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ మకరంద్, ఈఈ దేవీదాస్, ఏఈ ఉదయ్‌కిరణ్ తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, మున్సిపల్ కమిషనర్ మకరంద్

## డీఈఈసెట్ నోటిఫికేషన్ విడుదల

ఖలీల్‌వాడి, జూన్ 7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన డీఈఈసెట్–2024 విడుదలైంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10న ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంటర్‌లో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45శాతం మార్కులు, ఇతరులు 50శాతం మార్కులు సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. 01.09.2024 నాటికి 17 సంవత్సరాలు నిండిన వారు http://deecet.telangana. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6309535759, 9966509891 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## 10 నుంచి యథావిధిగా 'ప్రజావాణి'

కంఠేశ్వర్, జూన్ 7: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం యథావిధిగా కొనసాగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలి

- జడ్పీ సమావేశంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, వేదికపై కలెక్టర్ జితేశ్ పాటిల్

కామారెడ్డి, జూన్ 7: నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేసి దుకాణాలను సీజ్ చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన శుక్రవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంపై సమీక్షిస్తుండగా టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని ఎమ్మెల్యే పోచారం సూచించారు. రైతులకు సరిపడా పచ్చి రొట్ట విత్తనాలు అందించాలని సూచించగా ఇప్పటి వరకు 4,600 క్వింటాళ్ల జీలుగ, 1,343 క్వింటాళ్ల జనుము విత్తనాలను అందజేశామని, అదనపు కేటాయింపులకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ జితేశ్ పాటిల్ తెలిపారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని రైతులకు తెలిపి సన్నధాన్యం పండించేలా వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కల్పించాలని పోచారం అన్నారు. కొత్త మండలాల్లో పీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు పెరిగేలా చూడాలన్నారు. సదరం స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక కారణాలతో దివ్యాంగులు నష్టపోకుండా చూడాలని కోరగా రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు.

**రెండు, మూడు రోజుల్లో పాఠ్యపుస్తకాలు, దుస్తులు**

విద్యాశాఖపై సమీక్షలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేస్తామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 947 పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, చిన్నపాటి మరమ్మతు పనులు గుర్తించి చేపట్టామన్నారు.

**వచ్చే సీజన్‌లోనైనా కొనుగోళ్లు సరిగ్గా చేపట్టాలి..**

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షాలతో తడిసి బాధపడుతున్న రైతుల నుంచి క్వింటాలుకు 5కిలోల చొప్పున తరుగు తీయడం బాధాకరమని, వచ్చే సీజన్‌లోనైనా ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు చేయాలని సభ్యులు సూచించారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తున్నా చౌకధరల దుకాణాల ద్వారా దారుణమైన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని, వసతి గృహాలు,పాఠశాలల్లో విద్యార్థులు భోజనం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు.

**ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు**

జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇదే చివరి జడ్పీ సమావేశమని, ఐదేండ్ల నుంచి సభలు,సమావేశాలు సజావుగా నిర్వహించి ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధికారులు భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, విజయలక్ష్మి, రాజు, నిత్యానందం, హనుమంతరావు, రవి శంకర్, రాజేంద్ర కుమార్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మృగశిర కార్తె



బాల్కొండలో చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

సుభాష్‌నగర్/బాల్కొండ, జూన్ 7: తొలకరి జల్లులతో పలకరించే మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభమవుతుందని పండితులు పేర్కొంటున్నారు. వాతావరణంలో కలిగే మార్పులకు అనుగుణంగా పండుగలు, పర్వదినాలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. తొలకరి వర్షాలు మృగశిర కార్తెతో ప్రారంభమవుతాయని, రైతులు పంట పొలాలను సిద్ధం చేసుకోవడం, ఆరోగ్య రక్షణ కోసం చేపమందును, ఇంగువ బెల్లం మింగడం ఆనవాయితీగా వస్తున్నది. ఉదయం 7.05 నుంచి సాయంత్రం 5.05 గంటల వరకు ఇంగువ బెల్లాన్ని సేవించాలని వేదపండితులు ప్రకాశ్ శర్మ వివరించారు.

### మార్కెట్‌లో సందడి..

పలు గ్రామాల్లో మృగశిర కార్తెను ప్రజలు శుక్రవారమే నిర్వహించుకున్నారు. దీంతో చేపలను కొనేందుకు తరలివచ్చిన వారితో మార్కెట్‌లు కిటకిటలాడాయి. మృగశిర కార్తె రోజు చేపలను తినడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే.

## డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను భర్తీచేస్తాం

- డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్

రెంజల్,జూన్ 7: 'సార్లు లేని బడిలో పిల్లలను చేర్పించం' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు డీఈవో ఎన్‌వీ దుర్గాప్రసాద్ స్పందించారు. రెంజల్ మండలం కందకుర్తి జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను భర్తీ చేస్తామని నమస్తే తెలంగాణతో ఫోన్‌లో తెలిపారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల మేరకు డిప్యుటేషన్‌పై సరిపడా ఉపాధ్యాయులను భర్తీ చేస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని డీఈవో కోరారు.

